News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :253 | ఖమ్మం | శుక్రవారం, అక్టోబర్ 16, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# యాసంగిలో వరి పంట వేయొద్దు

**తాగు, సాగునీటితో పాటు విద్యుత్ సమస్య ఎదుర్కోబోతున్నాం**
**ఎల్‌నినో పరిస్థితులకు అంతా సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన**



- రాబోయే రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరిక
- ఎల్‌నినో పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై సీఎం రేవంత్ రెడ్డి చర్చ
- అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదు
- మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నాం
- ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి
- కేంద్ర- రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలి

హైదరాబాద్

ఎల్‌నినో విపత్తు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను వణికిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నామని హెచ్చరించారు. అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదని, మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కేంద్రం నుంచి ఎలాంటి సహాయం పొందాలనే అంశంపై చర్చించామని, గతేడాది ఈ సమయానికి 400 టీఎంసీలకు పైగా అందుబాటులో ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది అన్ని రిజర్వాయర్లలో కలిపి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని అన్నారు. ఎప్పుడు కరవు వచ్చినా ఈ దేశాన్ని ఆదుకున్నది రైతులు మాత్రమే అని కొనియాడారు. అందుబాటులో ఉన్న నీటినే పొదుపుగా వాడుకోవాలని, నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని యాసంగి పంటలు తగ్గించుకోవాలని, ఈ సీజన్‌లో పంటలు పండించటాన్ని వాయిదా వేసుకోవాలని, పెద్ద మనసు చేసుకుని యాసంగిలో వరి పంట వేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన వివరాలు 2లో..

## ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు



- ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి
- కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం



## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

- యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ సీఈపై సస్పెన్షన్ వేటు
- ఇన్‌ఛార్జులుగా ఐదుగురు ఐఏఎస్‌ల నియామకం
- యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు
- నిర్లక్ష్యంగా వ్యవహరించారని సీఈని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు
- విద్యుత్ అంతరాయాలపై సీఎం ఆగ్రహం

## 'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'

- తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన
- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
- 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
- 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం
- ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన

# కాంగ్రెస్, బీజేపీ భారీ స్కెచ్!



- త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది
- మొత్తం 77 మందిని ఇన్‌చార్జులుగా నియమించి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు సాధించేందుకు ప్రణాళిక రచించింది
- ఎమ్మెల్యేలు లేని చోట ఎంపీలు, ఎమ్మెల్సీలకు పగ్గాలు
- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను బీజేపీ వేగవంతం చేసింది
- ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రెండు కమిటీలను రంగంలోకి దించింది.

హైదరాబాద్

తెలంగాణలో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ పనితీరుకు పట్టభద్రుల తీర్పును మద్దతుగా మలచుకోవడంతో పాటు, రాబోయే రోజుల్లో రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకత్వం పావులు కదుపుతోంది. హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్‌నగర్ తో పాటు నల్గొండ- వరంగల్- ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలనే పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. ఈ ఉద్దేశంతో పార్టీ యంత్రాంగాన్ని వివరాలు 2లో..



## లక్ష్యం నెరవేరింది.. నక్సలిజం ముగిసింది

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలి
- ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయి
- దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదు
- ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది

## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు



- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు

## మనం చేసి చూపిద్దాం

- ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం
- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు





## కరెంట్ కోతలు.. అధికారులపై నెపమా రేవంత్?

- బొగ్గు నిల్వలు సమృద్ధిగా ఏర్పాటు చేసుకోకపోవడం, విద్యుత్ రంగంపై సకాలంలో సమీక్షలు నిర్వహించకపోవడం వల్లే కరెంట్ కోతల పరిస్థితి ఏర్పడింది
- ప్రభుత్వం చేసిన తప్పులకు అధికారులను బాధ్యులను చేస్తూ సీఎం, మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

# యాసంగిలో వరి పంట వేయొద్దు

-మొదటిపేజీ తరువాయి

పరిస్థితి ఏర్పడిందని, వచ్చే 8, 10 నెలలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

### కేంద్రం సహాయం చేయాలి

ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలని, కేంద్ర- రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలని కోరారు. కేంద్రం నుంచి అధిక నిధులు పొందే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించామని తెలిపారు. రాష్ట్రానికి అదనపు విద్యుత్‌ను ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. విద్యుత్‌పై ఇచ్చే సబ్సీడీలను పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కొవిడ్ సమయంలో ప్రధాని మోదీ చెప్పినవి చేశామని, కష్టకాలంలో రాజకీయాలు చేయకుండా ఏం చెప్పినా చేశామని అన్నారు. ఇప్పుడు విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి విపత్తును జయించడానికి అందరి సహకారం కావాలని, దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలని తెలిపారు.

"సాగు చేయని రైతులకు ఆ నష్టాన్ని కేంద్రం పూడ్చాలి. తాగునీరు, విద్యుత్ సమస్య అధిగమించేందుకు అందరూ సహకరించాలి. నీరు లేక పశువులు, మూగజీవాలకు నష్టపోయే పరిస్థితి రావొద్దు. రాష్ట్రానికి కేంద్రం తోడ్పాటు ఇస్తేనే ఈ విపత్తును అధిగమించగలం. సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ వేస్తున్నాం. సమస్యలు, సమాచారం ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఇస్తున్నాం. నోడల్ అధికారిగా రామకృష్ణారావును నియమిస్తున్నాం. దసరా తర్వాత భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తాం. కరవు పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మీడియాను కోరుతున్నా. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళాకారులు, క్రీడాకారులు ముందుకు రావాలి"

### రిజర్వాయర్లు అన్నీ ఖాళీ అయ్యాయి

రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం తక్కువ ఉన్నాయిని, గోదావరి బేసిన్‌లో నీటినిల్వలు 40 శాతం తక్కువ ఉన్నాయని వెల్లడించారు. చలికాలం రాకముందే రిజర్వాయర్లు



ఎండిపోతున్నాయని, రిజర్వాయర్ల నుంచి 24వేల గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉందని, నీటి కొరత వల్ల 12 లక్షల ఎకరాల పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందని, హైదరాబాద్‌కు నీరు అందించే జలశయాల్లో కూడా నీరు లేదని వివరించారు.

### మార్చిలో ఉండే ఎండలు అక్టోబర్‌లోనే

యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిందని, సగటుపై అదనంగా 5వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగిందని, మార్చిలో ఉండాల్సిన ఎండలు అక్టోబర్‌లోనే ఉన్నాయని తెలిపారు. "కొండపోచమ్మ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వారు. పంచపాండవుల కాలువ నుంచి నేరుగా మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు వెళ్తోంది. పంచపాండవుల కాలువ నుంచి నేరుగా మోటార్ల ద్వారా కేసీఆర్ నీరు తోడుకుంటున్నారు. రాష్ట్రంలో ఎవరికీ లేని ప్రత్యేక వెసులుబాటు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే ఎందుకు?. ప్రత్యేక మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు ఎత్తిపోతలపై నిజనిర్ధరణకు మేం సిద్ధం. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో అక్రమాలు ఉన్నాయని మొదట్నుంచి ఇంజినీర్ రఘు చెప్పారు. యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో రూ.17,950 కోట్లతో ఒప్పందం చేశారు. యాదాద్రి థర్మల్ కేంద్రం అంచనాలు రూ.37,781 కోట్లకు పెరిగింది. యాదాద్రి థర్మల్ కేంద్రం అంచనాలు ఏకంగా 110 శాతం ఎందుకు పెరిగింది?. ఒక్కో మెగావాట్‌కు రూ.8 వేల కోట్లు అదనపు అంచనాలు పెరిగాయి"

### అఖిలపక్షాలతో రేపు సమావేశం

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఎల్‌నినోపై సీఎం సలహాదారు రామకృష్ణారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎల్‌నినో పరిస్థితులపై రేపు అఖిలపక్షాలతో తెలంగాణ ప్రభుత్వం చర్చించనుంది.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిలో జరుగుతున్న అంతరాయంపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే దామరచర్లలో యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ (చీఫ్ ఇంజినీర్) సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విద్యుత్ ఉత్పత్తిలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చర్యలు తీసుకున్నారు. మరోవైపు పర్యవేక్షణ కోసం ఐఏఎస్ అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా ప్రభుత్వం నియమించింది.

మరోవైపు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించేందుకు థర్మల్ కేంద్రానికి ప్రభుత్వం ఏఐఎస్ అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించింది. హరికిషన్, వెంకటేశ్ దొత్రే, రాహుల్‌రాజ్, హనుమంత్ కొండిబ, శివకుమార్ నాయుడుని స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. వీరు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించనున్నారు. విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఐఏఎస్‌లనూ సస్పెండ్ చేస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

బుధవారం జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పలు అంశాలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు సరఫరా సాఫీగా జరిగే విధంగా చూడాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పరిస్థితిలో మాత్రం ఎందుకు మార్పు రావడం లేదని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో విద్యుత్తు కొరత ఏర్పడే ప్రమాదం



ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినప్పటికీ యాదాద్రి విద్యుత్తు ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది తానేనన్నారు. పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పరిస్థితి మారలేదని మండిపడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోనని అధికారులను హెచ్చరించారు. వైఫల్యాలపై విద్యుత్తు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్‌కో సీఎండీ సంబంధిత విభాగానికి సంబంధించిన అధికారులను సస్పెండ్ చేస్తానన్నారు. విద్యుత్తు అంతరాయాలకు రోజుకో కారణం చెప్పొద్దన్నారు.

# సింగరేణిలో వేడెక్కుతున్న రాజకీయం..!

**హైదరాబాద్ :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. ఆ తర్వాత జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు నగారా మోగనుంది. అయితే ఈ లోపే సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు రాజకీయ పార్టీలను అప్రమత్తం చేశాయి. వేలాది మంది కార్మికుల కుటుంబాలు సింగరేణి ఆధారంగా పనిచేస్తున్నారు. ఇలాంటి ఎన్నికల్లో గెలవడం ద్వారా సత్తా చాటాలని రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి.సింగరేణి సంస్థలో సుమారు 40 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కోల్‌బెల్ట్ ప్రాంతం దాదాపు 13 అసెంబ్లీ స్థానాల పరిధిలో విస్తరించి ఉంది. ఇక్కడి కార్మికులు, వారి కుటుంబాల ప్రభావం ఎన్నికల ఫలితాలపై గట్టిగా ఉంటుంది. అందుకే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. గతం నుంచి కూడా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన పార్టీనే ఆయా ప్రాంతాల్లో రాజకీయంగా పైచేయి సాధిస్తుందనే బలమైన నమ్మకం రాజకీయ వర్గాల్లో ఉంది.గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే యూనియన్ ఎన్నికలు జరుగాయి. అయితే ఇప్పుడు రాజకీయ సమీకరణాలు మారాయి. నవంబర్ లేదా డిసెంబర్ నాటికి ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించి ఇప్పటికే న్యాయస్థానంలో వివిధ సంఘాలు వేసిన పిటిషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ వైఖరి, కోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. అందుకే కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాలు గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేశాయి.ఎన్నికలు రాబోతున్నాయన్న సంకేతాలు రావడంతో అధికార, ప్రతిపక్ష



పార్టీలు కార్మికులను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. కార్మికుల ఓట్లను రాబట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ చర్యలపై దృష్టి సారించింది. కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలు, గృహ నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న సింగరేణి ఇళ్ల పట్టాల సమస్యల పరిష్కారం వంటి హామీలతో కార్మికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. దసరా పండగవేళ ప్రకటించిన భారీ బోనస్ కూడా తమకు కలిసొస్తుందని నమ్ముతోంది.ఇక.. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ దూకుడు మీదుంది. గల్ఫ్, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో తమకు మంచి పట్టు ఉందని ఆ పార్టీ నమ్ముతోంది. దాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే అనుబంధ సంఘం అయిన టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మిక గర్జనలు, బహిరంగ సభలను నిర్వహిస్తోంది. ఇవాళ చలో సింగరేణికి పిలుపునిచ్చిన ఆ పార్టీ? సింగరేణి సంస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వంపై ఎక్కుపెడుతోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో పాటు బీజేపీ అనుబంధ సంఘాలు అలాగే లెఫ్ట్ పార్టీల అనుబంధ యూనియన్లు కూడా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. కార్మికుల సమస్యలపై గళం విప్పుతున్నాయి. మంచిర్యాల, చెన్నూరు, రామగుండం వంటి కోల్‌బెల్ట్ ప్రాంతాలు ప్రధాన రాజకీయ పార్టీల కార్యకలాపాలతో హోరెత్తుతున్నాయి.గతంలో సింగరేణి ప్రాంతంలో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన శక్తులు నేడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కేవలం వేతన ఒప్పందాలు, బోనస్‌లు మాత్రమే కాకుండా కార్మికుల సర్వతోముఖాభివృద్ధి, ఉద్యోగ భద్రత, జీవన ప్రమానాల మెరుగుదల ఈ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. రాబోయే రోజుల్లో రానున్న సింగరేణి ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో రాబోయే పరిణామాలకు ఒక దిక్సూచిగా నిలవనున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కరెంట్ కోతలు.. అధికారులపై నెపమా రేవంత్?



**హైదరాబాద్:** తెలంగాణలో విద్యుత్ సంక్షోభం, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందంటూ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం చేసిన తప్పులకు అధికారులను బాధ్యులను చేస్తూ సీఎం, మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందించారు. బొగ్గు నిల్వలు సమృద్ధిగా ఏర్పాటు చేసుకోకపోవడం, విద్యుత్ రంగంపై సకాలంలో సమీక్షలు నిర్వహించకపోవడం వల్లే కరెంట్ కోతల పరిస్థితి ఏర్పడిందని హరీశ్ రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు తొమ్మిది నెలలుగా హెచ్చరిస్తున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు పరిస్థితి తీవ్రం కావడంతో అధికారులను సస్పెండ్ చేస్తామంటూ హెచ్చరించడం సరికాదన్నారు. నిషేధిత భూముల జాబితా అంశంలోనూ ప్రభుత్వమే తప్పులు చేసి అధికారులపై నెపం నెట్టిందని హరీశ్ రావు విమర్శించారు. విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే వైఖరిని అనుసరిస్తోందని ఆరోపించారు. ఎల్‌నినోను కోవిడ్ తరహా విపత్తుగా సీఎం అభివర్ణించడాన్ని ప్రస్తావిస్తూ.. అలాంటి పరిస్థితి వస్తుందని ముందే హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రభుత్వం ఎందుకు అప్రమత్తం కాలేదని ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్ వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్, బీజేపీ భారీ స్కెచ్!

-మొదటిపేజీ తరువాయి

ముందస్తుగా అప్రమత్తం చేసింది. మొత్తం 77 మందిని ఇన్‌చార్జ్‌లుగా నియమించి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు సాధించేందుకు ప్రణాళిక రచించింది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 43 మందిని, నల్గొండ- వరంగల్- ఖమ్మం స్థానానికి 34 మంది ఇన్‌చార్జ్‌లను కేటాయించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో ఆయా ఎమ్మెల్యేలకే ఆ బాధ్యతలు అప్పగించడం ద్వారా క్షేత్రస్థాయిలో నాయకత్వ సమన్వయ లోపం రాకుండా జాగ్రత్త పడ్డారు. ఎమ్మెల్యేలు లేని చోట ఎంపీలు, ఎమ్మెల్సీలకు పగ్గాలు అప్పగించారు. కొడంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యతను అనుముల తిరుపతిరెడ్డికి అప్పగించడం ద్వారా నాయకుల మధ్య జవాబుదారీతనం పెంచే ప్రయత్నం చేశారు.ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఈ రెండు ఎమ్మెల్సీ ఎన్నికలపై అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, ఓటర్ల నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో నేతల పనితీరుపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, మొదటి స్థానానికే పూర్తి ప్రాధాన్యం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. మంత్రులు సైతం ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఆదేశించడం ద్వారా ఈ ఎన్నికలను కాంగ్రెస్ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేసుకోవచ్చు.గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలుపు ఓటములు ప్రధానంగా ఓటర్ల నమోదు ప్రక్రియపైనే ఆధారపడి ఉంటాయి. పట్టభద్రులు పెద్ద ఎత్తున ఓటర్లుగా పేరు నమోదు చేసుకునేలా చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ పోలింగ్ బూత్ వరకు రప్పించడం ప్రస్తుతం కాంగ్రెస్ ముందున్న ప్రధాన సవాల్. ఈ నేపథ్యంలోనే ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని నేతలను ఆదేశించారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంతో, ప్రచార సమన్వయంపై ఇన్‌చార్జ్‌లు దృష్టిసారించారు.ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల ఫలితాలు రాబోయే రాజకీయ పరిణామాలపై, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయానికి అద్దం పడతాయని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. మేధావి వర్గంగా భావించే గ్రాడ్యుయేట్లు ఇచ్చే తీర్పు ప్రభుత్వానికి మరింత నైతిక బలాన్ని చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి.. అధికారంలో ఉన్న జోరును గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనూ ప్రదర్శించి క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌లో జోష్ నింపాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. ఇన్‌చార్జ్‌ల నియామకం, సీఎం రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచుతున్నాయి.

### రామచందర్ రావు వైపే మొగ్గు!

తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను బీజేపీ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రెండు కమిటీలను రంగంలోకి దించింది. ఈ కమిటీలు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాయి. ఇందులో ఒక స్థానానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైపే మెజారిటీ నేతలు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ కేడర్ మూడ్‌ను అంచనా వేయడానికి బీజేపీ హైకమాండ్ ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం విడివిడిగా రెండు కమిటీలను ఏర్పాటు చేసి మరీ కిందిస్థాయి అభిప్రాయాలను సేకరిస్తోంది. ముఖ్యంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఈ మూడు ఉమ్మడి జిల్లాల కీలక నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, గెలుపు గుర్రాల ఎంపికపై నేతలు తమ మనసులోని మాటను కమిటీ ముందుంచారు.ఈ అభిప్రాయ సేకరణలో మెజారిటీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత ఎన్.రామచందర్ రావు వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే స్థానం నుండి ప్రాతినిధ్యం వహించిన అనుభవం, పట్టభద్రులలో ఉన్న మంచి పేరు, లాయర్‌గా ఆయనకున్న ప్రజా మద్దతును నాయకులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. చాలా మంది నేతలు ఆయన పేరును మాత్రమే ప్రధానంగా సూచించినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నాయకుడికి మళ్లీ అవకాశం ఇస్తే గెలుపు మరింత సులభమవుతుందని కేడర్ గట్టిగా భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.మరోవైపు.. అభిప్రాయ సేకరణలో అందరూ ఏకాభిప్రాయంతో లేరని సమాచారం. కొంతమంది నాయకులు మాత్రం "పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ కేటాయించినా మాకు అభ్యంతరం లేదు, పార్టీ నిర్ణయమే శిరోధార్యం" అని స్పష్టం చేశారు. మరికొంత మంది మాత్రం ఒకవేళ రామచందర్ రావు కాకపోతే ఫలానా వ్యక్తికి అవకాశం ఇవ్వాలని ప్రత్యామ్నాయ అభ్యర్థుల పేర్లను సూచించారు. అయితే ఇలా సూచించిన వాళ్ళ సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.ఏది ఏమైనప్పటికీ, మెజారిటీ నాయకుల మద్దతు రామచందర్ రావు వైపు ఉండటంతో బీజేపీ వర్గాల్లో ఆయన పేరే ప్రధానంగా వినిపిస్తోంది. అభిప్రాయ సేకరణ కమిటీలు సేకరించిన ఈ నివేదికను త్వరలోనే రాష్ట్ర నాయకత్వం ద్వారా కేంద్ర పార్టీ అధిష్ఠానానికి నివేదించనున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న తరుణంలో, అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

# చింతకాని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలిగా జొన్నలగడ్డ మల్లీశ్వరి

**కార్యదర్శిగా గుడిది పిచ్చయ్య ఏకగ్రీవ ఎన్నిక**



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి..** చింతకాని మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా జొన్నలగడ్డ మల్లీశ్వరి(మనం న్యూస్) కార్యదర్శిగా గుడిది పిచ్చయ్య (సి కె న్యూస్)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా..... గడ్డం విజయ్....(ప్రజా దర్బార్) శెట్టి సురేష్.......(సందేశం టైమ్స్) గండారపు రామారావు....(సంచలన వార్త) గంటల తిరుపతాచారి.....(మెట్రో ఉదయం) వేర్పుల కోటేశ్వరరావు......(పయనించే సూర్యుడు) చాపలమడుగు మంగతాయి....(ప్రజా వేదిక) నూతన కమిటీ ఎంపికతో మండలంలో జర్నలిస్టుల ఐక్యతకు మరింత బలం చేకూరనుంది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు, కార్యదర్శులతో పాటు కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి ప్రెస్ క్లబ్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు మరియు ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య వారధిగా నిలవాలని పేర్కొన్నారు.నూతన కమిటీ జర్నలిస్టుల ఐక్యతను కాపాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించి, పాత్రికేయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

# చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ




**సీకే న్యూస్ ప్రతినిధి వనపర్తి జిల్లా:**చిన్నమందడి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి తమ హక్కులను కాపాడుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి దీప కాసరగడ్డ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా చిన్నమందడి గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసులు, భూ తగాదాలను ఇరు పక్షాల పరస్పర అంగీకారంతో రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మహిళల భద్రతా చట్టాలు, సమాచార హక్కు చట్టం, వృద్ధుల సంక్షేమ చట్టం, మోటారు వాహనాల చట్టం, వినియోగదారుల హక్కులు, విత్తనాల పంపిణీకి సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలసదన్‌ను సందర్శించి బాలికలతో మాట్లాడారు. వారికి ఏవైనా సమస్యలు ఉంటే న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ డి. కృష్ణయ్య, వ్యవసాయ అధికారి మహేశ్వరి, ఏఎస్సై, పంచాయతీ కార్యదర్శి, పారా లీగల్ వాలంటీర్ అహ్మద్, గ్రామ సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు.

# వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**సీకే న్యూస్ ప్రతినిధి వనపర్తి జిల్లా:**వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి రెండేళ్ల పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. మల్లికార్జున తెలిపారు.డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ కోర్సుల్లో ఒక్కో కోర్సుకు 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ బైపీసీ (దీఖ్యా.జ) ఉత్తీర్ణులకు ప్రాధాన్యత ఉంటుందని, బైపీసీ అభ్యర్థులు అందుబాటులో లేని పక్షంలో నిబంధనల ప్రకారం ఎంఎస్‌పీసీ (వీ్యా.జ) అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.అర్హులైన అభ్యర్థులు తెలంగాణ పారామెడికల్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్ల ఒక సెట్, జిరాక్స్ కాపీలు సమర్పించి, ప్రాసెసింగ్ ఫీజుగా రూ.100 చెల్లించాలి.దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబర్ 24, 2026 సాయంత్రం 4 గంటల వరకు. వెబ్‌సైట్లు:తెలంగాణ పారామెడికల్ బోర్డు: ఝఝఝ.్త్రజూఎ్‌.వశ్రీఖఅ్త్రుఖ.్త్రశీజ.అఅ??
వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాల: ఝఝ.్త్రఎఝుఖుజూఖతీ్త్రఎ.శీతీ్త్ర??
పూర్తి వివరాల కోసం పై వెబ్‌సైట్‌లను సందర్శించాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

# లైసెన్స్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.20 లక్షల విలువైన పేలుడు పదార్థాలు స్వాధీనం

- 20 వేల ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 90 బూస్టర్లు, రెండు వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఏడుగురు నిందితుల అరెస్ట్.. మరో ఇద్దరిపై కేసు నమోదు
- ఉత్తరప్రదేశ్ నుంచి తెలంగాణకు అక్రమంగా పేలుడు పదార్థాల రవాణా
- మైన్స్, క్రషర్లకు అధిక ధరలకు విక్రయించేందుకు కుట్ర
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు.
గురువారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..
పేలుడు పదార్థాలను అక్రమంగా రవాణా చేయడం, ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా నిల్వ చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు వాహనాల్లో అనుమానాస్పదంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా భారీ మొత్తంలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, బూస్టర్లు బయటపడ్డాయి.
ఉత్తరప్రదేశ్ నుంచి అక్రమ రవాణా
విచారణలో నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవికుమార్ అనే వ్యక్తి ద్వారా పేలుడు పదార్థాలను సమకూర్చుకుంటున్నట్లు వెల్లడైంది. అక్కడి కంపెనీ నుంచి ఇతరుల పేర్లపై బిల్లులు తీసుకొని, బూస్టర్ బాక్సుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను నింపి తెలంగాణకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అనంతరం వాటిని క్రషర్లు, క్వారీలు, మైన్స్‌కు అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.
ఈ క్రమంలో నిందితులు రెండు వాహనాల్లో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి పేలుడు పదార్థాలను తీసుకువస్తుండగా, జైనథ్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు.

**స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు:**
1. ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు -- 20,000 (అంచనా విలువ రూ.19,00,000).
2. బూస్టర్లు -- 90 (అంచనా విలువ రూ.15,000).
3. బొలెరో వాహనం -- 1 (నంబర్: ూ03ఖదీ0194).
4. హోండా సిటీ కారు -- 1 (నంబర్: ూ04జు=6575).
5. సెల్‌ఫోన్లు -- 6.

స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల మొత్తం అంచనా విలువ రూ.19.15 లక్షలు. వాహనాల విలువను ఇందులో కలపలేదు. మొత్తం స్వాధీనం విలువను సుమారు రూ.20 లక్షలుగా పేర్కొన్నారు.ఈ ఘటనపై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి, ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి సరఫరా చేయాలనుకున్నారు, ఈ అక్రమ రవాణాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు.
ప్రజల భద్రతకు విఘాతం కలిగించే అక్రమ కార్యకలాపాలపై పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

**అరెస్టయిన నిందితుల వివరాలు:**
1. చెప్యాల పరశురాము (30) -- తండ్రి: రవి, స్వస్థలం: కనగుర్తి గ్రామం, ఓదెల మండలం, పెద్దపల్లి జిల్లా; ప్రస్తుతం మేడిపల్లి, బోడుప్పల్ ప్రాంతం.
2. వల్లెపు తేజ (23) -- తండ్రి: స్వామి, స్వస్థలం: దుర్గా నగర్ కాలనీ, హనుమకొండ; ప్రస్తుతం కొప్పూర్ గ్రామం, భీమదేవరపల్లి మండలం.
3. కదం శ్రావణ్ (36) -- తండ్రి: రాములు, నివాసం: నరసింహులపల్లి గ్రామం, వీణవంక మండలం.
4. కస్తూరి సునీల్ (26) -- తండ్రి: ఐలయ్య, నివాసం: కొప్పూర్ గ్రామం, భీమదేవరపల్లి మండలం.
5. సూర రంజిత్ (25) -- తండ్రి: మైసయ్య, నివాసం: విశ్వనాథ్ కాలనీ, భీమదేవరపల్లి.
6. కస్తూరి మధు కిరణ్ (28) -- తండ్రి: మొండయ్య, నివాసం: చింతలపల్లి గ్రామం, శంకరపట్నం మండలం.
7. పాగల సంపత్ రెడ్డి (52) -- తండ్రి: నర్సింహారెడ్డి, నివాసం: చింతలపల్లి గ్రామం, శంకరపట్నం మండలం.

కేసులో మరో ఇద్దరు నిందితులు: ఎం.డి. వాహిద్, రవికుమార్. వీరి వివరాలు, పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి. శ్రావణ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై పి. గౌతమ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రార్థివదేహాలకి నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

- బాసు హనుమంతు నాయుడు



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఈరోజు గద్వాల నియోజకవర్గం కె.టీ.దొడ్డి మండలం గంగన్ పల్లి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ కె.వీరేష్ అనుమానస్పదంగా మరియు మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలో లవన్న తండ్రి బంట్రోతు గోపాల్ అనారోగ్యంతో మృతి చెందారు... విషయం తెలుసుకొని వారి స్వగృహాలకి వెళ్లి, ఇరువురి ప్రార్థివదేహాలకు పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.....అదే విధంగా, జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నందు గట్టు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు....వీరి వెంట,ప్రతాప్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, పైటల నరసింహులు,చక్రీధర్ రెడ్డి, డి.శేఖర్ నాయుడు,బీచుపల్లి, రఘుపతి,శ్రీరాములు,బుడన్న, కృష్ణయ్య,మటమారి తాయప్ప, హుస్సేనప్ప,పోగుల నరసింహులు,రాము,యుగంధర్,జంగిలప్ప, అంపన్న, లక్ష్మన్న, మహేష్, కృష్ణ, మహేందర్,మరియు నాయకులు తదితరులు ఉన్నారు...

# పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం నాయకత్వంలో నెరవేరినది

## గద్వాల మండలం ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల**
ఈరోజు గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పరిధిలోని కొత్త పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరయ్యారు. గద్వాల మండలం పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ కు మంజూరు కావడం జరిగినది నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది
నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారులి .
ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ ....**
నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇల్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి గారికి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరఫున ధన్యవాదాలులి .....

**ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ...**
ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం కి మంత్రి కి మా ఎమ్మెల్యే కి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి రమేష్ నాయుడు మహేశ్వర్ రెడ్డి, సర్పంచ్ సుజాత ఆంజనేయులు, మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మనస్థాపం చెంది వ్యక్తి ఆత్మహత్య,



**అక్టోబర్ 15 సీ కే న్యూస్ చేగుంట :**సాజు తండా కు చెందిన కేతావత్ దంజా వయస్సు (53) సం, తండ్రి రావుజీ, కులం లంబాడి, వృత్తి వ్యవసాయం సాజు షుగర్ వ్యాధితో బాధపడుతూ హాస్పటల్లో చూపించుకున్న ఎంతకు తగ్గడం లేదని మనస్థాపం చెంది పశువుల కొట్టంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు, ఇట్టి విషయంలో మృతిని భార్య కేతావత్ బూలీ ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు,

# రజక సంఘం యూత్ సోషల్ మీడియా అధ్యక్షులుగా, సట్ట భాను ప్రసాద్ నియామకం,



**అక్టోబర్ 15 (సీ కే న్యూస్) చేగుంట** :గౌడుగుపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు రజక సంఘం యూత్ అధ్యక్షులుగా నియమితులయ్యారు వారికి దౌల్తాబాద్ రజక మండల అధ్యక్షులు ముత్యం గారి స్వామి నియమాక పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నవీన్ కోశాధికారి నర్సింలు సలహాదారుడు స్వామి రజక సంఘ సభ్యులు స్వామి పాల్గొన్నారు,

# బెక్కెం గ్రామంలో అట్టహాసంగా బీపీల్ - 8 సేసన్

- సంయుక్తంగా ప్రారంభించిన కాంగ్రెస్ యువ నేత జూపల్లి అరుణ్, బీజేపీ యువ నాయకుడు ధారాసింగ్
- ఆహ్లాదకర వాతావరణంలో బెక్కెంలో క్రికెట్ పోటీలు
- బ్యాటింగ్ చేసి క్రికెటర్లను ఉల్లాసపరిచిన జూపల్లి అరుణ్
- బెక్కెంలో మినీ స్టేడియంకు సహకరించాలని మంత్రి జూపల్లిని కోరిన ధారా సింగ్
- క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చిన జూపల్లి అరుణ్

**సికే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి :**చిన్నంబావి మండల పరిధిలోని బెక్కెం గ్రామంలో గత కొన్నేళ్లుగా విజయవంతంగా నడుస్తున్న బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ ఏడాది కూడా అట్టహాసంగా మొదలైంది. బీపీఎల్ సీజన్ – 8 ప్రారంభ వేడుకకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ యువనేత జూపల్లి అరుణ్, బీజేపీ యువ నేత ధారసింగ్ హాజరయ్యారు. జూపల్లి అరుణ్ ఓపెనింగ్ మ్యాచ్ కు ముందు కాసేపు బ్యాటింగ్ చేసి క్రికెటర్లను ఉల్లాసపరిచారు. మొదటి మ్యాచ్ కి టాస్ వేసి ధారాసింగ్ టోర్నీని ప్రారంభించారు.

బీపీఎల్ సీజన్ – 8కు ధారాసింగ్ ప్రథమ బహుమతిగా 40 వేల రూపాయలను ప్రైజ్ మనీగా బహుకరించారు. ఉప సర్పంచ్ శివ కుమార్ ద్వితీయ బహుమతిగా 30 వేల రూపాయలు బహుకరించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని అన్నారు. బెక్కెంలో 8 సీజన్లుగా నడుస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఎంతో మంది క్రీడాకారులలో క్రీడా స్ఫూర్తిని నింపుతోందని... ఈ సంప్రదాయం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. క్రీడలను ప్రోత్సహించడమే తమ అభిమతమని దానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ యువనేత ధారాసింగ్ మాట్లాడుతూ బెక్కెంలో క్రికెట్–క్రీడల అభివృద్ధి కోసం గత కొన్నేళ్లుగా ఎంతో కృషి చేస్తున్నామని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రోత్సహిస్తే గ్రామంలో క్రీడాకారుల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోనే అతి పెద్దదైన బెక్కెం గ్రౌండ్ ని మినీ స్టేడియంగా తీర్చిద్దెందుకు మంత్రి సహకరించాలని కోరారు. మినీ స్టేడియంగా తీర్చిదిద్దితే తాను ఫ్లడ్ లైట్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా మంత్రి అండదండలు అందిస్తే బెక్కెం గ్రామాన్ని ఆదర్శ గ్రామ పంచాయితీగా తీర్చిదిద్దుతామని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా, బేషజాలకు పోకుండా సహకరించాలని అధికార పార్టీ కార్యకర్తలను కూడా అదుపు చేయాలని జూపల్లి అరుణ్ ని ధారాసింగ్ కోరారు. ఈ కార్యక్రమంలో జూపల్లి అరుణ్ బాబు ముఖ్య అతిథిగా, గ్రామ సర్పంచ్ కమలాబాయి ముఖ్య అతిథిగా, పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి చిదంబ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెబ్బేటి రామచంద్రారెడ్డి, ఉమ్మడి మండలాల మాజీ జెడ్పిటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్, జంగం బీచుపల్లి యాదవ్, పెబ్బేటి తేజరెడ్డి, కొప్పునూరు గ్రామ సర్పంచ్ వద్దేమాన్ బిచ్చన్న, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు జిల్లా జనరల్ సెక్రెటరీ బిజెపి పార్టీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, చిన్నంబావి మండల అధ్యక్షులు బొగ్గు కుర్మయ్య, గోపి నాయుడు, గణేష్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వద్దేమాన్ రామకృష్ణ, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## చిత్తాపురం వద్ద బయో ఎనర్జీ కంపెనీ ఏర్పాటుకు భూమి పూజ

- రైతులకు లాభదాయకంగా బయో ఎనర్జీ పరిశ్రమ




**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబరు 15.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని చిత్తాపురం స్టేజి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి యాజమాన్యం ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కంపెనీ ఏర్పాటు ద్వారా స్థానిక రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని యాజమాన్యం తెలిపింది. రైతులు తమ పొలాల్లో లభించే వరిగడ్డిని నేరుగా కంపెనీకి విక్రయించుకునే అవకాశం ఉంటుందని, వరిగడ్డిని వినియోగించి బయో ఎనర్జీని ఉత్పత్తి చేయనున్నట్లు వివరించింది. దీంతో రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.తెలంగాణ రాష్ట్రంలో ఈ తరహా పరిశ్రమల్లో ఇది నాలుగో కంపెనీగా ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో భూమి పూజ నిర్వహించినట్లు యాజమాన్యం వెల్లడించింది. త్వరలోనే కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపింది. ఈ కార్యక్రమంలో ముద్దాపురం సర్పంచ్ సామ రామిరెడ్డి, చిత్తాపురం సర్పంచ్, నరసాపురం సర్పంచ్ ఉప్పలయ్య, వేములకొండ సర్పంచ్, గోపరాజుపల్లి సర్పంచ్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## వలిగొండ మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డులు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ.

ఎమ్మెల్యే సమక్షంలో.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబర్ 15.**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా ఆహార భద్రతకు భరోసా కల్పించడంతో పాటు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డుల ద్వారా అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.అదేవిధంగా, సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందించడం ద్వారా వారి సొంతింటి కల సాకారమయ్యేందుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పనోచేయడమే మా ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో లింగరాజు పెల్లి సర్పంచ్ బొడిగ లింగస్వామి లింగరాజు పల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షులు బొడిగె నరసింహా మండలం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గంధ మల్ల నరసింహా మత్స్యగిరి గుట్ట ధర్మకర్త బొడిగె వెంకటేశం లబ్ధిదారులు గంధమల్ల పుష్ప మాజీ ఎంపీపీ నూతి రమేష్ కాంగ్రెస్ నాయకులు ఇన్నయ్య.

## గ్రామంలో కుంకుమార్చనలు పూజలు



**సికె.న్యూస్. నేరడిగొండ** దేవీ నవరాత్రుల సందర్భంగా మండలంలోని కుమారి గ్రామపంచాయతీ లోని గాంధీ చౌక్ దుర్గామాత ఉత్సవ కమిటీ. ఆధ్వర్యంలో.గురువారం మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో దుర్గదేవికి పూజలు నిర్వహించారు అనంతరం సామూహికంగా మహిళలు మంగళారతులు తో కుంకుమార్చనలు నిర్వహించారు. మొక్కులు. మొక్కుకొని గ్రామంలో లోక కళ్యాణ కుటుంబ సభ్యుల. ఆయుష్ ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తూ పెద్ద ఎత్తున మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు

## డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణంను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** ఖమ్మంలో డిసిసిబి చైర్మన్ కు రాకుల నాగభూషణం ను పరామర్శించిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మధిర టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లిశీగాల కమల్ రాజు జిల్లా రైతు బంధువు నాయకులు మంకెన రమేష్ కోమట్ల గూడెం సర్పంచ్ పరిశుద్ధ రావు తిర్లాపురం మాజీ సర్పంచ్ బండి రామారావు కోడుమూరు గ్రామ రైతుబంధు మాజీ అధ్యక్షులు బోగ్గ ర పు రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## పలు గ్రామాల్లో నూతన విద్యుత్ నియంత్రికల ప్రారంభం

- రేపల్లెవాడ--ప్రొద్దుటూరు మధ్య 2.4 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లింక్ లైన్ ప్రారంభం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా మెరుగుదలే లక్ష్యంగా నూతన విద్యుత్ నియంత్రికలను ప్రారంభించారు. మధిర డివిజనల్ ఇంజనీర్ ఆధ్వర్యంలో రామకృష్ణాపురం, కోడుమూరు, లచ్చగూడెం, నేరెడ, కోమట్లగూడెం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికలను ప్రారంభించారు.అదేవిధంగా రేపల్లెవాడ––ప్రొద్దుటూరు గ్రామాల మధ్య 2.4 కిలోమీటర్ల పొడవున ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ లింక్ లైన్‌ను సైతం ప్రారంభించారు.ఈ సందర్భంగా డివిజనల్ ఇంజనీర్ బి. శ్రీనివాసరావు, బోనకల్ సహాయ డివిజనల్ ఇంజనీర్ వై.వి. ఆనంద్ కుమార్ రైతులు, విద్యుత్ వినియోగదారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు.ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, రానున్న రోజుల్లో ఎదురయ్యే నీటి ఎద్దడి, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై చర్చించారు. విద్యుత్‌ను అవసరమైన మేరకు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.అలాగే గ్రామాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితులపై రైతుల అభిప్రాయాలను సేకరించి, వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో చింతకాని విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ శ్రీధర్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అప్పాజీపల్లి నుంచి ఏడుపాయలకు భక్తుల పాదయాత్ర

భక్తిశ్రద్ధలతో వనదుర్గ భవాని మాత దర్శనం



**సికె న్యూస్ మెదక్ జిల్లాకొల్చారం, అక్టోబర్ 15** మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి దుర్గ భవాని భక్తులు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర చేపట్టి ఏడుపాయల వనదుర్గ భవాని మాతను దర్శించుకున్నారు. అమ్మవారి నామస్మరణతో సాగిన పాదయాత్ర భక్తుల్లో ఉత్సవాన్ని నింపింది. ఈ సందర్భంగా ధనరాజ్ స్వామి మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురా ఆరోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నే బోయిన వేణు స్వామి, కన్నే బోయిన నర్సింలుస్వామి, హర్షిత మాత, ఆశ్రిత మాత, సాయి మోక్షిమాత, ప్రణీత మత, రాజబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దు: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**సికె.న్యూస్. ప్రతినిధి..ఆదిలాబాదు:**రిమ్స్ ఆసుపత్రిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, రోడ్లు, భవనాల నిర్మాణాలు, మరమ్మతులు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం రిమ్స్ ఆసుపత్రితో కొనసాగుతున్న అభివృద్ధి పనులను, కొత్తబ్లాక్ నిర్మాణాలను, మరమ్మత్తు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో రిమ్స్ డైరెక్టర్ చాంబర్లో అధికారులతో సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. టెండర్లలో బిడ్లు తక్కువకు వేసినప్పటికీ పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. ఎంబీఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం కన్సల్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షించి, నిర్దేశిత 13–14 శాతం ప్రాఫిట్ మినహాయించి నాణ్యమైన పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఒకవేళ ఎక్కడైనా లోపాలు లేదా గ్యాప్స్ ఉంటే, వాటిని వెంటనే గుర్తించి మరింత పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను అప్రమత్తం చేశారు. కొత్తబ్లాక్, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అటెండెండ్లు, రోగుల సౌకర్యార్థం వాషింగ్ ఏరియాలు, డస్ట్ బిన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. డస్ట్ బిన్లు, వాషింగ్ బేసిన్లు సక్రమంగా వాడకపోతే లేదా పరిశుభ్రత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలకు, సెక్యూరిటీ గార్డులకు తక్షణమే జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన బుక్స్ ప్రింట్ అయ్యాయని, త్వరలో క్షేత్రస్థాయిలో జరిమానాల అమలు ప్రారంభమవుతుందని తెలిపారు.ఎసిఎల్‌బి, నావిగేషన్, ఇతర అధికారుల బృందాలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలిస్తూనే ఉంటాయని, లోపాలుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కొత్తబ్లాక్ ప్రాంతంలో ఇప్పటికే ఎంఎన్ఐసీయూ సేవలు ప్రారంభించామని, ఈ బ్లాక్‌కు సంబంధించి శానిటేషన్ అన్ని రకాలుగా మెరుగ్గా ఉండాలని సూచించారు. త్వరలోనే దీనిపై మరోసారి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి తదుపరి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని, పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆయన పునరుద్ఘాటించారు.

అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భూ కొలతల సర్వే శాఖలో సర్వేయర్ గా పని చేస్తున్న గోవింద్ ను కలెక్టర్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ తనిఖీలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వివిధ విభాగాల వైద్యులు, రోడ్లు భవనల శాఖ ఈఈ రమేష్, పంచాయతీ రాజ్, మున్సిపల్, జి.ఎం.ఎస్.సి.డి ల ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణకు వేగవంతమైన చర్యలు



**సికె.న్యూస్ ప్రతినిధి.. ఆదిలాబాద్:**2,009.23 ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదనలు.. 2,004.31 ఎకరాలకు నోటిఫైడ్ పీఎన్ జారీ ఆదిలాబాద్‌లో సంయుక్త వినియోగ (జాయింట్ యూజర్) విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయం కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,004.31 ఎకరాలకు సంబంధించి నోటిఫైడ్ పీఎన్ జారీ చేసినట్లు వెల్లడించారు.గ్రామాల వారీగా భూసేకరణ వివరాలు ఇలా ఉన్నాయి. అర్లి–బి గ్రామంలో 160.32 ఎకరాలు, కచ్‌కంటి గ్రామంలో 29.19 ఎకరాలు, టాక్లి గ్రామంలో 5.20 ఎకరాలు, అనుకుంట గ్రామంలో 878.13 ఎకరాలకు పూర్తిస్థాయిలో నోటిఫైడ్ పీఎన్ జారీ చేశారు. నిషాన్‌ఘాట్ గ్రామంలో ప్రతిపాదిత 430.09 ఎకరాలకు గాను 428.16 ఎకరాలకు, ఖానాపూర్‌లో 288.14 ఎకరాలకు గాను 288.13 ఎకరాలకు నోటిఫైడ్ పీఎన్ జారీ చేశారు. ఆదిలాబాద్ గ్రామంలో 216.36 ఎకరాలకు గాను 213.38 ఎకరాలకు సంబంధించి ప్రక్రియ పూర్తయింది.

మొత్తం ప్రతిపాదిత భూమిలో దాదాపు పూర్తి విస్తీర్ణానికి సంబంధించి నోటిఫైడ్ పీఎన్ జారీ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన భూమికి సంబంధించిన ప్రక్రియను సైతం నిబంధనల మేరకు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాలో రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో పాటు వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి, పర్యాటక రంగ విస్తరణకు మరింత అవకాశం కలుగుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## బెక్కెం గ్రామం లో బిపిఎల్ సీజన్--8 క్రికెట్ టోర్నమెంట్

- క్రీడాకారుల ప్రోత్సాహమే లక్ష్యం
- బెక్కెం సన్‌రైజర్స్ జట్టుకు డ్రెస్సుల స్పాన్సర్‌గా
- మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వడ్డేమాన్ రామకృష్ణ






**సి కే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి :** క్రీడల అభివృద్ధికి చేయూత.. యువతకు ప్రోత్సాహం.. క్రీడాకారుల విజయానికి సహకారం బెక్కెం బిపిఎల్ సీజన్--8 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న బెక్కెం సన్‌రైజర్స్ క్రికెట్ జట్టుకు డ్రెస్సులను స్పాన్సర్ చేసి తన క్రీడాభిమానాన్ని చాటుకున్నారు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేమాన్ రామకృష్ణ. క్రీడా కారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఆయన అందించిన సహకారం జట్టు సభ్యుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. యువ క్రీడాకారులకు ప్రోత్సాహం.. క్రీడా రంగానికి చేయూత! నేటి యువత క్రీడల్లో రాణిస్తూ తమ ప్రతిభను చాటుకోవాలని, క్రీడల ద్వారా ఐకమత్యం, క్రమశిక్షణ, పట్టుదల వంటి విలువలను అలవర్చుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో బెక్కెం సన్‌రైజర్స్ జట్టుకు డ్రెస్సులు స్పాన్సర్ చేయడం ద్వారా వడ్డేమాన్ రామకృష్ణ క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించారు. క్రీడాకారులు తమ ప్రతిభను వెలికితీసేందుకు అవసరమైన సహకారం అందించడం అభినందనీయమని, ఇలాంటి ప్రోత్సాహం యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని క్రీడాభిమానులు పేర్కొంటున్నారు. క్రీడా కారుల్లో నూతనోత్సాహం బిపిఎల్ సీజన్--8 క్రికెట్ టోర్నమెంట్‌లో బెక్కెం సన్‌రైజర్స్ జట్టు మెరుగైన ప్రదర్శన కనబరిచి విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. జట్టుకు డ్రెస్సులను స్పాన్సర్ చేసిన వడ్డేమాన్ రామకృష్ణకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. క్రీడల అభివృద్ధికి, యువత ప్రోత్సాహానికి ఇలాంటి సహకారాలు ఎంతో దోహదపడతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## వలిగొండ మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డులు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ. ఎమ్మెల్యే సమక్షంలో.










**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబర్ 15.** ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా ఆహార భద్రతకు భరోసా కల్పించడంతో పాటు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డుల ద్వారా అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అదేవిధంగా, సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందించడం ద్వారా వారి సొంతింటి కల సాకారమయ్యేందుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పనోచేయడమే మా ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల అధ్యక్షులు బత్తిని సహదేవగౌడు పట్టణ అధ్యక్షులు పోలేపాక జానకి రాములు మాజీ ఎంపీపీ నూతి రమేష్ పిఎసిఎస్ చైర్మన్ గరిస రవి కంచనపల్లి సర్పంచ్ రేసు బుచ్చిరెడ్డి లబ్ధిదారులు గోపరాజుపల్లి సర్పంచ్ పృథ్వీ లబ్ధిదారులు వేములకొండ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం లబ్ధిదారులు కాంగ్రెస్ జిల్లానాయకులు కేసిరెడ్డి నీరజారెడ్డి ఎస్.కె రసూల్ ఎమ్మార్వో సిబ్బంది ఎం డి ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## 25 కె.వి ట్రాన్స్ఫర్ ను ప్రారంభించిన విద్యుత్ శాఖ మధిర డిఈ :శ్రీనివాసరావు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం నేరడ గ్రామంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు బిసి కాలనీలో 25 కెవి ట్రాన్స్ఫారం ను ఏర్పాటు చేసినారు ఈ రోజు విద్యుత్ శాఖ మధిర డిఈ శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించినారు ఈ కార్యక్రమంలో బోనకల్ ఏడిఏ ఆనంద్ మండల ఏఈ శ్రీధర్ సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు లైన్ ఇన్స్పెక్టర్ చంటి కరెంట్ సిబ్బంది వేణు భద్రం.అన్నపురెడ్డి పుల్లయ్య తదితరులు ఉన్నారులి

# ఎల్‌నినో ప్రభావం.. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం

**నీటి కొరతను అధిగమించేందుకు రైతులు పంటల వైవిధ్యంపై దృష్టి సారించాలి: మండల వ్యవసాయాధికారి సతీష్**



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు తగ్గిపోయి నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రాబోయే సీజన్‌లో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని చింతకాని మండల వ్యవసాయాధికారి పి. సతీష్ సూచించారు. లచ్చగూడెం గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేపడితే నీటి కొరత కారణంగా పంట నష్టాలు సంభవించే ప్రమాదం ఉందని, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. అందువల్ల రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పెసర, మినుము, జొన్న, సజ్జ, రాగులు వంటి అపరాలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఈ పంటల ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతోపాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో లచ్చగూడెం గ్రామ సర్పంచ్ కొప్పుల రజిని, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బి. కార్తీక్, ఎస్‌కే అయేషా ఫాతిమా, సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో క్యాప్సికం సాగు పరిశీలన

లచ్చగూడెం గ్రామంలో ఎన్ఎంఎన్ఎఫ్ ( ఎన్ ఎం ఎన్ ఎఫ్) ప్రకృతి వ్యవసాయ పథకం కింద సాగు చేస్తున్న క్యాప్సికం పంట క్షేత్రాన్ని మండల వ్యవసాయాధికారి పి. సతీష్ పరిశీలించారు. బీఆర్‌సీ ద్వారా నిర్వహిస్తున్న ఈ క్షేత్రంలో ప్రకృతి ఆధారిత సాగు పద్ధతులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరును పరిశీలించారు.

పంటకు ఆశించే పురుగులను గుర్తించి నియంత్రించేందుకు సోలార్ లైట్ ట్రాప్‌లు, పసుపు, నీలం రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రసాయన పురుగు మందులకు బదులుగా ఎంటమోపాథోజెనిక్ నెమటోడ్స్ ( ఈపిఎన్ ) వంటి జీవ నియంత్రణ పద్ధతులను వినియోగిస్తున్నారని వివరించారు. అలాగే కలుపు నియంత్రణ, పొలం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో క్యాప్సికం సాగు చేయడం ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచి, వారిలో అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని వ్యవసాయాధికారి తెలిపారు. రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ పంటల వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బి. కార్తీక్, ఎస్‌కే అయేషా ఫాతిమా, ఎన్ఎంఎన్ఎఫ్ బీఆర్‌సీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

**కలాం ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం: మాద్రి పృథ్వీరాజ్**




**పటాన్‌చెరు,అక్టోబర్ 15(సీ కే న్యూస్):** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పూలమాలలు వేసి కలాంకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబంలో జన్మించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తన ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర కృషితో దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని పేర్కొన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధితో పాటు దేశ రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

కలాం జీవితం ప్రతి విద్యార్థికి ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, నిరంతరం శ్రమించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, అశోక్, శ్రీధర్ చారి, పరమేష్, వెంకటేష్, ఆశమ్, కొండల్, శ్యామ్, షకీల్, రామ్మోహన్, వీరారెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి -- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కిషన్ నగర్, చించోడ్, అయ్యవారిపల్లి, వెంకట్ రెడ్డి పల్లి గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.. గ్రామ పంచాయతీ భవనాలకు భూమిపూజ



**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 15 :** షాద్‌నగర్ నియోజకవర్గంలోని గ్రామాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు, రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

కిషన్ నగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

కిషన్ నగర్ గ్రామంలో 1,020 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+హా) నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో మొదటి విడతలో 43 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రెండో దశలో మరో 10 ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అవసరమైతే మరో 10 ఇళ్లను కూడా మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కిషన్ నగర్‌లో 48 మహిళా సంఘాలు ఆదర్శవంతంగా పనిచేస్తుండటం పట్ల ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

చించోడ్‌లో రేషన్ కార్డుల పంపిణీ.. బీటీ రోడ్డుకు శంకుస్థాపన,చించోడ్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 2.75 కోట్లతో హెచ్ఎండీఏ నిధులతో మంజూరైన చించోడ్ నుంచి వెంకట్ రెడ్డి పల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షాధారిత పంటల సాగు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు. పంటలు చేతికి వచ్చే కీలక సమయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అదనంగా మరో రెండు గంటల విద్యుత్ సరఫరా చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరినట్లు ఎమ్మెల్యే,తెలిపారు. అయ్యవారిపల్లిలో గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ,అయ్యవారిపల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో మంజూరైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భూమిపూజ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

వెంకట్ రెడ్డి పల్లిలో స్మార్ట్ కార్డుల పంపిణీ.. తండాలో 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభంలి

వెంకట్ రెడ్డి పల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పూసల గడ్డ తండాలో 24 గంటల విద్యుత్ సరఫరాను, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్, రహదారులు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్,పిఎసిఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్ రాజ్ గౌడ్,పిఎసిఎస్ వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను నాయక్, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగారి రవి,తాలూకా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్,సర్పంచులు బాబు నాయక్, నర్సమ్మ, నర్సింహులు, శ్రీనివాస్, రమేష్ నాయక్, శివకుమార్, రామకృష్ణ,వడ్ల జంగయ్య ,మల్లేష్,చందు నాయక్, నాయకులు ముబారక్ అలీ ఖాన్ ,రాజు,కుమార్ నాయక్, శ్రీధర్ రెడ్డి, అనంతం, ప్రకాష్ గౌడ్, కట్ట వెంకటేష్, భరత్ రెడ్డి, వెంకట్ రెడ్డి,తిగాపూర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతకు గోవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు



**జిన్నారం, అక్టోబర్ 15(సీ కే న్యూస్):** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని ఏడుపాయల దుర్గామాత ఆలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరిపై దుర్గామాత ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు.

దుర్గమ్మ తమ ప్రజలను చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరి కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ ధైర్యాన్ని ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ఏడుపాయల దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం పెరగాలి..

- పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
- రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన




**రామచంద్రాపురం, అక్టోబర్ 15(సీ కే న్యూస్):** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యా వ్యవస్థల అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.రామచంద్రపురం డివిజన్ పరిధిలోని కాశిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 32 లక్షల రూపాయల నిధులతో నిర్మించ తలపెట్టిన నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నిధులతోపాటు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి బాటలో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరిన్ని ప్రభుత్వ విద్య సంస్థలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం మరింత పెరగాలని కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, రౌండ్ టేబుల్ ఇండియా సైబరాబాద్ వన్ చైర్మన్ ప్రశాంత్, సీనియర్ నాయకులు పరమేష్, ఐలేష్, రాజు, సంస్థ ప్రతినిధులు లక్ష్య జైన్, నిర్మల్ గుప్తా, ఆనంద సాగర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇల్లందు పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం.. ముగ్గురికి రిమాండ్

- ప్రజా రాకపోకలకు అంతరాయం.. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో చర్యలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,సీకే న్యూస్ ప్రతినిధి, ఇల్లందు, అక్టోబర్ 15 : ఇల్లందు పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో పాటు, రోడ్డుపై అడ్డంగా నిలబడి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించిన ముగ్గురిని ఇల్లందు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ ఘటనలో బండి వెంకటేశ్వర్లు, మద్దెల గోపి, బండి రాజయ్యలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసు సిబ్బంది విధుల నిర్వహణకు ఆటంకం కలిగించినట్లు పేర్కొన్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు**

సమస్యలు, వివాదాలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని ఇల్లందు పోలీసులు సూచించారు. ఆత్మహత్యాయత్నం చేస్తామని బెదిరించడం, పెట్రోల్ వంటి ప్రమాదకర పదార్థాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, రహదారులను దిగ్బంధించి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

**చట్ట ఉల్లంఘనపై కఠిన చర్యలు**

ఇలాంటి చర్యల వల్ల ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లడంతో పాటు, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పోలీసులు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకుంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు.

## ప్రత్యేక పూజలు పాల్గొన్న మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

- భక్తిభావంతో నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసుకోవాలి
- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి



షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 15 రంగారెడ్డి జిల్లా ఫరుక్ మండలం కమ్మదానం గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సందర్శించి అమ్మవారికి,ప్రత్యేక,పూజలు,అర్చనలు,నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను సజీవంగా ఉంచుతూ,భక్తిభావంతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను,స్థానిక యువతను అభినందిస్తూ నవరాత్రి ఉత్సవాలు విజయవంతం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,కమ్మదనం సర్పంచ్ లతా కిరణ్ కుమార్ గౌడ్,పోమాలపల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,డిప్యూటీ సర్పంచ్,జగన్నాథ్,నాయకులు,వార్డు సభ్యులు,రాఘవేందర్ రెడ్డి యెన్నం నారాయణరెడ్డి,సిరిగిరి కవిత వెంకటేష్,లక్ష్మీ చెన్నయ్య గౌడ్, గులాబ్ శ్రీను,భాను ప్రకాష్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు శివగల రాజు,శ్రీనివాస్ రెడ్డి బల్వంత్ రెడ్డి, కంటే కుమార్,నర్సింలు యాదవ్ చిన్నారెడ్డి,కేదారేశ్వర యాదవ్,మల్లికార్జున గౌడ్,వడ్ల రాజు,శివాజీ,చింటూ, కుమార్,వలిక శ్రీను,అజయ్,అరవింద్,పవన్ గ్రామస్తులు పాల్గొన్నారు

## మహిళల అభ్యున్నతికి నైపుణ్య శిక్షణ

- తిమ్మరావుపేటలో ఉచిత బ్యూటీషియన్ కోర్సు ప్రారంభం



సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు అక్టోబర్ 16 2026: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించి, స్వయం ఉపాధితో తమ కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఏన్కూరు మండల పరిధిలోని తిమ్మరావుపేట గ్రామంలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గుగులోత్ సుమలత మహేష్ చౌరవతో ఖమ్మం మైత్రాసన సాంఘిక సేవా సంస్థ సహకారంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.మహిళలకు ఉపాధి కల్పించే దిశగా వృత్తి నైపుణ్యాలను నేర్పించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. బ్యూటీషియన్ రంగంలో శిక్షణ పొందడం ద్వారా మహిళలు భవిష్యత్తులో సొంతంగా ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు, ఇతరులకు సేవలందిస్తూ ఆదాయం సమకూర్చుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఖమ్మం మైత్రాసన సాంఘిక సేవా సంస్థ అధ్యక్షులు బిషప్ సెగ్రీ ప్రకాష్, డైరెక్టర్ ఫాదర్ సురేష్, తిమ్మరావుపేట విచారణ గురువు ఫాదర్ డేవిడ్ సహకారంతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.మహిళలు తమలోని ప్రతిభను వెలికితీసి, నేర్చుకున్న నైపుణ్యాలను ఉపాధి మార్గాలుగా మలుచుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని మహిళలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు సాయిబాబు, నందిని, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా ప్రపంచ కూచిపూడి దినోత్సవం

**'నాట్యోత్సవ 2026'లో సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు**



పటాన్చెరు,అక్టోబర్ 15(సీ కే న్యూస్): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ కూచిపూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 'నాట్యోత్సవ 2026' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని సంస్కృతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రముఖ కూచిపూడి గురువు, పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం కళా వారసత్వానికి నివాళులర్పించారు.

ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది విద్యార్థులు బ్రహ్మాంజలి, జతీస్వరం, మురుగ శబ్దం, భామాకలాపం, తరంగం వంటి సంప్రదాయ కూచిపూడి నృత్యరూపాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అభిగ్న మురుగ శబ్దంలో ప్రదర్శించిన భావవ్యక్తీకరణ, భామాకలాపంలో సత్యభామ పాత్రలో హర్ష కనబరిచిన అభినయం విశేష ప్రశంసలు అందుకున్నాయి. మంగళంతో వేడుకలు ముగిశాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాట్య నివేదన వ్యవస్థాపకుడు, గురువు చిరంజయ్ పొద్దార్ మాట్లాడుతూ, కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యం సాధించేందుకు కఠోర సాధన, అంకితభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. డాక్టర్ వెంపటి చిన సత్యం కూచిపూడి కళారంగానికి అందించిన సేవలను కొనియాడుతూ, సంప్రదాయ కళలను నేర్చుకోవడం, వాటి వారసత్వాన్ని కాపాడుకోవడంలో కళాకారులు నిబద్ధతతో ముందుకు సాగాలని సూచించారు.

ఈ వేడుకల్లో విదుషి అంజు అరవింద్, విద్వాన్ ఆనందు మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించిన గీతం విద్యార్థులు**

**అధునాతన పరిశోధనలు, వర్ధమాన సాంకేతికతలపై ప్రత్యక్ష అవగాహన**

హైదరాబాద్: అధునాతన పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అవగాహన పొందేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన 33 మంది విద్యార్థులు, నలుగురు అధ్యాపకులు గురువారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ ను సందర్శించారు. గీతం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా మెకానికల్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన పరిశోధనలు, ప్రయోగశాలల పనితీరును పరిశీలించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, ఇంజనీరింగ్ ఆవిష్కరణలపై అవగాహన కల్పించడం, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాల్లో విద్యార్థినుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ సందర్శన ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థుల బృందం రోబోటిక్స్, సాఫ్ట్ మ్యాటర్ అండ్ మైక్రోస్విమ్మర్స్, ఇన్నోవేషన్ హబ్, కాంక్రీట్, విండ్ టన్నెల్ ప్రయోగశాలలను సందర్శించింది. అక్కడ స్వయంచాలక రోబోట్లు, డ్రోన్లు, నీటి అడుగున తనిఖీ వ్యవస్థలు, కృత్రిమ మైక్రోస్విమ్మర్లు, ర్యాపిడ్ ప్రోటోటైపింగ్, త్రీడీ ప్రింటింగ్, ఆధునిక కాంక్రీట్ సాంకేతికతలు, విండ్ టన్నెల్ పరీక్షల గురించి తెలుసుకున్నారు.

ప్రయోగశాలల సందర్శన ద్వారా విద్యార్థులకు పరిశోధనల ఆచరణాత్మక అనువర్తనాలపై విలువైన అవగాహన లభించింది. తరగతి గది అభ్యాసానికి మించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలిగింది. పరిశోధనల పట్ల ఆసక్తి, సృజనాత్మక ఆలోచన, ఆవిష్కరణల దృక్పథాన్ని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉన్నత విద్య, శాస్త్రసాంకేతిక రంగాలు, అంతర విభాగ పరిశోధనల్లో విద్యార్థినులు విస్తృత అవకాశాలను అన్వేషించేలా గీతం మహిళా సాధికారత విభాగం ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది.

ఈ సందర్శనలో గీతం అధ్యాపకులు డాక్టర్ కె. మల్లేశ్వరి, టి. రాజ్ ప్రియాంక, డాక్టర్ జ్యోతి రశ్మి నాయక్, డాక్టర్ సొపర్ణి పాల్ పాల్గొన్నారు.

## మధిర నియోజకవర్గం లో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి...

**బిజెపి రాష్ట్ర కార్యదర్శి మరియు ఖమ్మం జిల్లా ప్రబారి శ్రీ బద్దం మహిపాల్ రెడ్డి..**



మధిర అక్టోబర్ 15(సికె న్యూస్)ప్రతినిధి.వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలబికు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా భారతీయ జనతా పార్టీ మధిర నియోజవర్గ స్థాయి సమావేశం నేడు మధిరలో జరిగింది... ఎమ్మెల్సీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం జిల్లా ప్రభరి శ్రీ బద్దం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రతి ఒక్క పట్టభద్రుని కలిసి ఓటర్ల నమోదులో చైతన్యం పెంచాలని దిశా నిర్దేశం చేశారు, కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటీశ్వరరావు మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలోని అన్ని మండలాల వ్యాప్తంగా ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు..

ఈ కార్యక్రమంలో బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి పెరుమాళ్ళపల్లి విజయరాజు, ఎమ్మెల్సీ ఖమ్మం జిల్లా కో కన్వీనర్ చిలువేరు సాంబశివరావు, బిజెపి మధిర నియోజకవర్గ కో కన్వీనర్ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మర్సకట్ల స్వర్ణాకర్, బిజెపి మధిర మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి,టౌన్ అధ్యక్షులు శివరాజు సుమంత్, ఎర్రుపాలెం మండల అధ్యక్షులు అనుమోల సురేష్, చింతకాని మండలం అధ్యక్షులు కొండా గోపి, బోనకల్ మండలం అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక, ముదిగొండ మండల అధ్యక్షులు అల్లిక శ్రీకాంత్, బీజేపీ జిల్లా కార్యదర్శులు రామిశెట్టి నాగేశ్వరరావు, కుంచెం కృష్ణారావు జిల్లా కార్యవర్గ సభ్యులు గుండా చంద్రశేఖర్ రెడ్డి, నూతక్కి నరసింహారావు, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కొమ్మినేని కృష్ణారావు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పాపట్ల రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు, దోర్నాల రవీంద్ర ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిలు గరిడేపల్లి వేణు దుగ్గిదేవర మణికంఠ బీజేపీ మధిర మండల ఉపాధ్యక్షులు యలమర్తి వీరబ్రహ్మం, జడ కృష్ణ పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, ఎమ్మెల్సీ మండల కన్వీనర్లు కోకన్వీనర్లు మరియు జిల్లా పదాధికారులు మండల పదాధికారులు వివిధ మోర్చాల అధ్యక్షులు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## నందిని నిశ్చితార్థ వేడుకకు హాజరై ఆశీర్వదించిన బొప్పారం, తిరుమలాపురం గ్రామ సర్పంచులు!

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని బొప్పారం గ్రామంలో వేడుకల సందడి నెలకొంది. బొప్పారానికి చెందిన ఆత్మకూరు సైదులు--సంధ్య దంపతుల కుమార్తె, నందిని– ఉషా రావుల నిశ్చితార్థ వేడుక బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అత్యంత ఘనంగా, కన్నులపండువగా జరిగింది.స్థానికంగా ఉన్న వారి నివాసంలో ఈ శుభకార్యం నిర్వహించారు. ఈ వేడుకకు గ్రామస్తులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు.ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా బొప్పారం గ్రామ సర్పంచ్ షేక్ రహమతుల్లా , తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు విచ్చేశారు. నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న నందిని – ఉషా రావులను ఆపూర్వంగా అభినందించి, ఘనంగా ఆశీర్వదించారు.గ్రామ పెద్దలు, ఇరు కుటుంబాల ఆశీస్సులతో జరిగిన ఈ నిశ్చితార్థ వేడుకతో బొప్పారంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సంతోషకరమైన సందర్భంలో నూతన జంటకు అందరూ శుభాకాంక్షలు తెలిపారు.





## కృష్ణాపురం గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు -- సమావేశం నిర్వహణ



మధిర అక్టోబర్ 15(సికె న్యూస్)ప్రతినిధి.మధిర మండలం కృష్ణాపురం గ్రామంలోలి ఈరోజు గ్రామ బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్, గ్రామ బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ హరి ప్రసాద్ కమిటీ నిర్వహించాల్సిన విధివిధానాలు, బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరంగా తెలియజేశారు.

గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బాలల హక్కులను కాపాడటం మనందరి బాధ్యతని, పిల్లల సంక్షేమం, భద్రతపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలనిలి సూచించారు. మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు మాట్లాడుతూ.. గ్రామంలో బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారు తిరిగి పాఠశాలకు వెళ్లేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అలాగే బాల్య వివాహాలు జరగకుండా చూడటంతో పాటు, బాలలపై ఎలాంటి వేధింపులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, బాలల భద్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటరుగా నమోద చేసుకోవాలిని పిలుపునిచ్చిన మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్

**పట్టభద్రుల ఓటుతో ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలిలి**

**నందిగామ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ స్వామి గౌడ ఆధ్వర్యంలో**

షాద్నగర్ నియోజకవర్గ నందిగామ సి కె న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 15 : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం నందిగామ మండల కేంద్రంలోని రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదుపై యువత, విద్యావంతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు.

2023లోపు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకుని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో చేగూర్ నందిగామ పీఏసీఎస్ చైర్మన్లు పసుల బుచ్చయ్య, చంద్రపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, జితేందర్ రెడ్డి, నర్సింహులు, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, చేగూర్ సర్పంచ్ మంకాల శ్రీశైలం, బుగ్గోనీగూడ గ్రామ సర్పంచ్ బుగ్గ సాలయ్య, వెంకమ్మగూడ గ్రామ సర్పంచ్ గొల్లపల్లి అశోక్, నందిగామ ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఆవుల మంద శివ శంకర్, వెంకమ్మగూడ గ్రామ మాజీ సర్పంచ్ బియ్యని రజినిత వీరేందర్ గౌడ్, ఇన్‌చార్జీలు నర్సింహులు, జంగయ్య, కాంగ్రెస్ పార్టీ తాలూకా యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండాల అనిల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ విఘ్నేష్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# అధికారులు ఆఫీసులకే పరిమితమైతే కుదరదు!

**వార్డుల్లో పర్యటించాల్సిందే..సమస్యలను గుర్తించాల్సిందే..పరిష్కరించాల్సిందే!**

**అధికారులను హెచ్చరించిన మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత**

**మధిర అక్టోబర్ 15(సికె న్యూస్)ప్రతినిధి.**మధిర మున్సిపాలిటీ 19వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్ పర్సన్ మధిర అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే ప్రజా సమస్యలు కాగితాలకే పరిమితమవుతాయి.క్షేత్రస్థాయిలో అడుగుపెట్టి మూలాలను గుర్తిస్తేనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది అని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు.పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె హెచ్చరించారు.గురువారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో ఆమె పర్యటన చేపట్టారు.ఈ పర్యటనలో వైస్ చైర్మన్ కోనధని కుమార్, ఆ వార్డు కౌన్సిలర్ యన్నం శెట్టి అప్పారావు, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ పాల్‌తో పాటు వివిధ శాఖల కీలక అధికారులను వెంటబెట్టుకుని ఆమె వార్డులోని ప్రతి సందు,ప్రతీ గల్లీని కాలినడకన కలయతిరుగుతూ స్థానిక పరిస్థితులను,ఇబ్బందికర అంశాలను స్వయంగా పరిశీలించారు.ఎక్కడెక్కడ ఏ సమస్య పేరుకుపోయింది? ప్రజలు ఏయే ఇబ్బందులతో సతమతమవుతున్నారు? అనే వివరాలను కౌన్సిలర్‌ను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న తాగునీరు, వీధి దీపాలు మరియు పారిశుద్ధ్యం వంటి వివిధ సమస్యలపై ఆమె అధికారులతో మాట్లాడారు.ప్రజాక్షేత్రంలో పర్యటించి ఈ సమస్యలను మూలాల నుంచి గుర్తించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని తేల్చిచెప్పిన ఆమె...పేరుకుపోయిన ఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అలాగే, వార్డులో దెబ్బతిని పాడైపోయిన రోడ్ల దుస్థితిపై ఆమె స్పందిస్తూ.. ఆ రోడ్ల సమస్యను త్వరలోనే శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు.ఈ పర్యటన కౌన్సిలర్ రమణ నాయక్,వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.






## తెలంగాణ ప్రజల్లో మార్పు తేవడమే జనసేన పార్టీ ధ్యేయం

- ఏ పార్టీ చేయనిది జనసేన పార్టీ బీసీలకు న్యాయం చేస్తుంది
- ఖమ్మం - నల్గొండ - వరంగల్ జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ గెలుపే మా లక్ష్యం




**మధిర అక్టోబర్ 15(సికె న్యూస్)ప్రతినిధి.**మధిర ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జన సేనపార్టీ మధిర నియోజకవర్గ పి ఓ సి మెంబర్ పార్టీ డేవిడ్ అధ్యక్షత మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల సురేష్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రాబోయే కాలంలో జనసేన పార్టీ బలంగా ఉంటుందని డబ్బుకు దాసోహం కాదని జనసేన పార్టీ ప్రజల పార్టీ అని చెప్పి ఆయన అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏ పార్టీ చేయనిది జనసేన పార్టీ చేసిందని ముఖ్యంగా బీసీలకు న్యాయం చేస్తుందని ఖమ్మం నల్గొండ వరంగల్ జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గడల శ్రీనివాస్ గెలుపే దిశగా పయనిస్తామని నియోజకవర్గంలో ప్రతి మండలానికి బిఎల్వోలు ఉన్నారని కాంక్షిస్తూ తెలంగాణలో జనసేన బలంగా ఉంటుందని ఆయన సందర్భంగా వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని టిఆర్ఎస్ తీసుకొచ్చిందని బీసీలకు తగిన న్యాయం చేయలేదని ఆయన తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో పగడాల పవన్ కుమార్, తోట దీపకళ, రమేష్, కుమార్, సజ్జనపు భరత్, పూచ్చ నాగబాబు,

## వలిగొండలో ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబర్ 15.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులైన పొట్ట మమత, శ్రీరామ్ మంగమ్మ, గంగాపురం పూజిత, దుబ్బ స్వప్నలకు పథకాల ప్రయోజనాలను అందజేశారు.

జిల్లా నాయకులు బద్దం సంజీవరెడ్డి, గ్రామ సర్పంచ్ తాడూరి లలిత, మండల ప్రధాన కార్యదర్శి గంగాపురం సాయిబాబా పాల్గొన్నారు.గ్రామశాఖ అధ్యక్షుడు పబ్బతి వెంకటేష్, బుల్లెట్ సూరి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మండల, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవిత్ర ఉమ్రా యాత్రకు బయలుదేరిన భక్తులు



**శంషాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 15** : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం పరిధిలోని పవిత్ర ఉమ్రా యాత్ర నిమిత్తం హైదరాబాద్ నగరం నుంచి భక్తుల బృందం సౌదీ అరేబియాకు బయలుదేరింది. నగరానికి చెందిన పలువురు యాత్రికులు మక్కా, మదీనా పుణ్యక్షేత్రాలను దర్శించుకొని ప్రత్యేక,ప్రార్థనలు,చేయనున్నారు.,ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ, ఉమ్రా యాత్రకు వెళ్లడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని, తమ కుటుంబాలతో పాటు ప్రజలందరి శాంతి, సౌభాగ్యాల కోసం దువా చేస్తామని తెలిపారు. యాత్రకు బయలుదేరిన వారికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు.,ఉమ్రా యాత్ర అనేది ఇస్లాం ధర్మంలో ఎంతో పవిత్రమైనదిగా పరిగణిస్తారని, ఈ యాత్ర ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని పెద్దలు పేర్కొన్నారు.

## చింతకాని హైస్కూల్ సెంటర్ నందు బతుకమ్మ సంబరాలు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని గ్రామం హై స్కూల్ సెంటర్ నందు ప్రతిష్ఠించబడిన దుర్గాదేవి సమక్షంలో. ఆడబిడ్డలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించుకొని కోలాహలంగా అమ్మవారి సమక్షంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని దిగ్విజయ పరచడం జరిగింది

## ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ పనుల పరిశీలన

-ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించిన మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ గౌడ్

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని: మండల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎస్.కె. అబ్దుల్ మజీద్‌కు సంబంధించిన ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ పనులు జరుగుతున్న సందర్భంగా ఖమ్మం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ గౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పనులను పరిశీలించి పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలో కొమ్మిని రామారావు, పెద్ద గౌండ్ల వెంకటనారాయణ, నామవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్.కె. కాసిం, పోట్ల నాగేశ్వరరావు, మేకనబోయిన బాబు, తూము బిక్షం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉసికెల సైదులు, మేకనబోయిన ఉపేందర్, తిప్పట్ల జనార్ధన్, కోలా శ్రీనివాసరావు, తూము పిచ్చయ్య, తేనె పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీకి ఐ-మాక్స్ ఫ్లడ్ లైట్లు విరాళం.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబర్ 15.**లింగరాజుపల్లి: గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తూ లింగరాజుపల్లి గ్రామానికి చెందిన గోపగోని కిష్టయ్య తనయుడు గోపగోని వినోద్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఐ-మాక్స్ ఫ్లడ్ లైట్లను విరాళంగా అందజేశారు.

గ్రామ సర్పంచ్ బోడిగే లింగస్వామి, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో ఈ లైట్లను గ్రామ పంచాయతీ కార్యాలయానికి బహూకరించారు.

అడిగిన వెంటనే స్పందించి గొప్ప మనసుతో సహకారం అందించిన వినోద్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజల తరఫున గోపగోని వినోద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మధిరలో ఘనంగా విజిలెన్స్ అవగాహన కార్యక్రమం



**ముఖ్యఅతిథిగా హెచ్ పి డిప్యూటీ జనరల్ మేనేజర్**

**అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: అధికారులు**

**మధిర అక్టోబర్ 15(సికె న్యూస్)ప్రతినిధి.**మధిర లో శ్రీ సాయి వెంకటేశ్వర హెచ్ పి గ్యాస్ ఏజెన్సీలో జరిగే మీటింగ్ సమాజంలో, సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించే లక్ష్యంతో విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని మధిరలోని శ్రీ సాయి వెంకటేశ్వర హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ జనరల్ మేనేజర్ (విజిలెన్స్) మరే సునీల్ కుమార్, విజయవాడ డిప్యూటీ మేనేజర్ కే. శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ రాహుల్, ఖమ్మం సేల్స్ ఆఫీసర్ జక్కం పవన్ నరేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన గ్యాస్ పంపిణీదారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సంస్థల అభివృద్ధికి, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు విజిలెన్స్ అవగాహన ఎంతో కీలకమని పేర్కొన్నారు. అవినీతి, లంచగొండితనానికి దూరంగా ఉంటూ నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. అవినీతి రహిత వాతావరణం ఏర్పడటానికి ఉద్యోగులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా పాల్గొన్నవారితో నిజాయితీ, నిష్పాక్షికత, నైతిక విలువలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సంస్థాగత నిబంధనలు, పారదర్శక సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సేల్స్ విభాగం సిబ్బంది, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆలస్యం లచ్చయ్య కు నివాళులర్పించిన సిపిఎం పార్టీ నాయకులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**నాగలవంచ గ్రామం సిపిఎం పార్టీ నాయకులు అనారోగ్యం తో మరణించిన ఆలస్యం అచ్చయ్య గభౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించిన వారు సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పున్నం వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వత్సవాయి జానకి రాములు మండల నాయకులు తోటకూరి వెంకట నరసయ్య సీనియర్ నాయకులు సామినేని అప్పారావు గ్రామ శాఖ కార్యదర్శులు కందరబోయిన కొండలరావు రౌతు అప్పారావు శాఖ సభ్యులు కంభం శ్రీనివాసరావు అంబటి ఖాదర్ బాబు ఎస్.కె చిన్న మీరా అంబటి మధు గంధం నాగార్జున పరిటాల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## వాజేడు మండలంలో సమీక్షా సమావేశం

- 22 మంది లబ్ధిదారులకు 22,02,552 రూ.,ల కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణి
- కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావ్



**సికే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి షేక్ రహీమ్ :**వాజేడు మండలంలో గురువారం పర్యటించిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

అనంతరం వాజేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద 22 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ.22,02,552 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గిరిజన ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాగులవంచ సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఆలస్యం అచ్చయ్య కి కాంగ్రెస్ నాయకుల నివాళులు




సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఆలస్యం అచ్చయ్య మరణించడంతో, వారి పార్థివదేహాన్ని సందర్శించి కాంగ్రెస్ నాయకులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలస్యం వెంకటేశ్వర్లు , మాజీ గ్రామ సర్పంచ్ కంభం వీరభద్రం , ఆలస్యం నాగమణి-బసవయ్య, నాయకులు ఆలస్యం సుధాకర్, మండెపూడి మదన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.ద

## వాజేడు సబ్‌స్టేషన్‌లో సి జి అర్ ఎఫ్ సమావేశం నిర్వహణ.



సి కే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి షేక్ రహీమ్ :ఈరోజు వాజేడు మరియు వెంకటాపురం మండలాలకు సంబంధించి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వాజేడు సబ్‌స్టేషన్‌లో సి జి అర్ ఎఫ్ సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో రైతులు మరియు ప్రజాప్రతినిధులు తమ సమస్యలను సి జి అర్ ఎఫ్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు.

సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలు:

1. జగన్నాథపురం, ధర్మారం గ్రామాల రైతుల విజ్ఞప్తి: మిర్చి మరియు వరి పంటలు సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ అవసరాల దృష్ట్యా రాత్రి సమయంలో అదనంగా రెండు గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని చైర్‌పర్సన్ గారిని కోరారు.
2. వెంకటాపురం గ్రామ పంచాయతీ సమస్య: వెంకటాపురం సర్పంచ్ గారు పుష్కర్ ఘాట్ మరియు స్మశాన వాటిక వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని దరఖాస్తు సమర్పించారు.
3. కొంగల గ్రామ పంచాయతీ సమస్య: గ్రామ పంచాయతీ మోటారు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉండటం వల్ల తరచూ ఫ్యూజులు పోతూ ఇబ్బందులు ఎదురవుతున్నాయనికొంగల సర్పంచ్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు.

సి జి అర్ ఎఫ్ చైర్‌పర్సన్ ఆదేశాలు:

సమస్యలపై తక్షణమే స్పందించిన చైర్‌పర్సన్ గారు, వాజేడు ఏ ఈ మరియు ఏ డి ఈ లకు క్రింది ఆదేశాలు జారీ చేశారు.

ఓవర్‌లోడ్‌తో ఇబ్బందులు ఎదురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనపు సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలి.

గ్రామ పంచాయతీల తీఘం (గ్రామీణ నీటి సరఫరా) మోటార్ల కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి...

ఈ కార్యక్రమంలో ములుగు రాజు శ్రీ బిక్షపతి ,ఎస్ ఏ ఓ , ఏ డి ఓ లు (వెంకటాపురం మరియు వాజేడు) మరియు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న ఘనపూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభానికి ఆవుల రాజిరెడ్డి రాక

కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్



సికె న్యూస్ మెదక్ జిల్లాకొల్చారం, అక్టోబర్ :కొల్చారం మండలంలోని చిన్న ఘనపూర్ గ్రామపంచాయతీ పరిధిలో అక్టోబర్ 16న పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు గ్రామానికి రానున్నారని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ తెలిపారు.

రాజిరెడ్డి సహకారంతో మంజూరైన పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి, అనంతరం తన సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను స్థానిక సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నారు. అలాగే పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని సైతం ప్రారంభించనున్నారు.

ఈ కార్యక్రమానికి కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రాజిరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్ కోరారు.

# జయమ్మ చెరువు రిజర్వాయర్‌తో నారాయణపేటకు జలకళ!



- దివంగత చిట్టెం నర్సిరెడ్డి ఆశయశీ జయమ్మ చెరువు రిజర్వాయర్ సాధన
- భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ప్రాజెక్టు పనులు వేగవంతం
- కుంభం శివకుమార్ రెడ్డి
- రైతులకు 14 లక్షల నుండి 20 లక్షల పరిహారం అందడం లో పోరాటం చేసిన సిపిఎం వెంకట్రాంరెడ్డి,గోపాల్, బలరాం

నారాయణపేట జిల్లా అక్టోబర్ 15,(సి కే న్యూస్): నారాయణపేట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో చేపట్టిన మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా జయమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నారాయణపేట మండలం పేరపల్లి గ్రామంలోని జయమ్మ చెరువులో గురువారం నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి పాల్గొని,రైతులతో కలిసి రిజర్వాయర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను,నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణ,గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

అనంతరం సర్పంచ్ ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జయమ్మ రిజర్వాయర్ ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమని, ఎన్నో ఏళ్ల పోరాటం, రైతుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగానే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, వలసలు తగ్గి గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### దశాబ్దాల పోరాటానికి ప్రతిఫలం

జయమ్మ చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఒక్కరోజులో రూపుదిద్దుకోలేదని, దాని వెనుక దశాబ్దాల పోరాటం, ఎన్నో అవరోధాలు,అనేకమంది నాయకుల కృషి ఉన్నాయని కుంభం శివకుమార్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఎన్నో ప్రయత్నాలు జరిగాయని గుర్తుచేశారు. రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ప్రాంత అభివృద్ధి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

గతంలో అధికారంలో ఉన్న కొందరు జయమ్మ చెరువు అభివృద్ధి విషయంలో సరైన అవగాహన లేకుండా మాట్లాడారని, రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని పేర్కొన్నారు. ఆ సమయంలోనే అవకాశం లభిస్తే ఈ ప్రాంతానికి సాగునీరు తీసుకొచ్చి అభివృద్ధి ఎలా చేయవచ్చో చేసి చూపిస్తానని చెప్పానని, నేడు నిర్మాణ పనుల ప్రారంభంతో ఆ దిశగా అడుగులు పడుతున్నాయని అన్నారు. తన బావ దివంగత చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి, మామ దివంగత చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలను నెరవేర్చడమే తన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా చిట్టెం నర్సిరెడ్డి ఈ ప్రాంత సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయమ్మ రిజర్వాయర్ నిర్మాణం ఆయన కలను సాకారం చేసే కీలక ఘట్టమని, ఈ ప్రాజెక్టును దివంగత చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలకు అంకితం చేస్తున్నానని భావోద్వేగంగా ప్రకటించారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న సహకారం కీలకమని కుంభం శివకుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, పనుల పురోగతికి అవసరమైన చర్యలు, గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు, భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందించే అంశాలను ప్రస్తావించారు. ఈ ప్రాంత ప్రజల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. భూములు కోల్పోతున్న,నష్టపరిహారం అందుకున్న రైతులు మాట్లాడుతూ 20 లక్షల పరిహారం పెంపుకు ప్రత్యేకంగా కారణమైన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి,గోపాల్ బలరాశీ లను రైతులు పొగిడారు. 14 లక్షల 20 లక్షలు రైతులకు నష్టపరిహారం పెంచేందుకు ప్రభుత్వంతో పోరాటం లో మాకు ఎంతగానో అండగా నిలిచిన సిపిఎం పార్టీ నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు అని భూ నిర్వాసితుల రైతులు వారికి తెలిపారు.

ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి పనులు పూర్తి చేసే దిశగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు చేసిన కృషి అభినందనీయమని, అందరి సహకారంతోనే పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సాగునీరు, తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

### రైతుల త్యాగాలకు వెలకట్టలేం.. ప్రతి ఒక్కరికీ న్యాయం

జయమ్మ రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు అందించిన రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువబోమని కుంభం శివకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం జరగాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పరిహారం విషయంలో ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు.రైతుల భూముల్లో ఉన్న బావులు, బోర్లు, చెట్లు, షెడ్లు తదితర ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి ఆస్తినీ రికార్డుల్లో నమోదు చేయాలని అధికారులను కోరారు. భూములతో పాటు తమ జీవనాధారాలను కోల్పోతున్న కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పరిహారం అందించే ప్రక్రియలో పారదర్శకత ఉండేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రైతులు తనపై, ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డిపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయబోమని అన్నారు. ఈ ప్రాంతంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కూడా పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. తన చివరి శ్వాస వరకు నారాయణపేట ప్రాంత ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు.

### అడ్డంకులు అధిగమించి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

ప్రజలకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టులను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని కుంభం శివకుమార్ రెడ్డి ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారంతో ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నిర్మాణ పనులకు సహకరించాలని కోరారు.

అప్పిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులను కూడా త్వరలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఆ రిజర్వాయర్ నిర్మాణం వల్ల గ్రామానికి, రైతులకు అనవసర ఇబ్బందులు కలగకుండా, గ్రామానికి నష్టం వాటిల్లకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులపై అపోహలకు తావివ్వకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని కోరారు.

జయమ్మ రిజర్వాయర్ సాధన కోసం గతంలో జయమ్మ చెరువు నుండి అసెంబ్లీ వరకు సైకిల్ యాత్ర నిర్వహించాం - సిపిఎం గోపాల్,వెంకట్రామిరెడ్డి

జయమ్మ చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలన్న డిమాండ్‌తో గతంలో హైదరాబాద్ అసెంబ్లీ వరకు సైకిల్ యాత్ర నిర్వహించినట్లు సీపీఎం నాయకులు గోపాల్, వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు అందించి, సాగునీటి సమస్యను పరిష్కరించడం ద్వారానే వలసలను నివారించవచ్చని వారు పేర్కొన్నారు.

గతంలో జయమ్మ చెరువు రిజర్వాయర్ సాధన కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసి సమస్యను వివరించామని, ఆ ప్రయత్నాల నేపథ్యంలోనే 69వ జీవోకు సంబంధించిన పరిణామాలు చోటుచేసుకున్నాయని వెంకట్రామిరెడ్డి గుర్తుచేశారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతుల త్యాగాలను కొనియాడుతూ,వారికి ఎంత పరిహారం ఇచ్చినా వారి త్యాగాలకు వెలకట్టలేమని గోపాల్ అన్నారు.

### మీడియా మిత్రులకు క్షమాపణలు తెలిపిన కుంభం

జయమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులకు భూమిపూజ అనంతరం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో కుంభం శివకుమార్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పేరపల్లి వద్ద జరిగిన కార్యక్రమంలో మీడియా ప్రతినిధుల పట్ల అసహనం వ్యక్తం చేసిన ఘటనపై ఆయన విచారం వ్యక్తం చేసి, మీడియా మిత్రులకు క్షమాపణలు తెలిపారు.

ఎన్నో సంవత్సరాల కల నెరవేరుతున్న కీలక సమయంలో కొందరు రాజకీయ నాయకులు రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆవేదనతోనే ఆ సందర్భంలో స్పందించానని వివరించారు. మీడియా ప్రతినిధులపై తనకు ఎలాంటి వ్యతిరేక భావన లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర కీలకమని పేర్కొన్నారు.తాను 1994లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని, 2005లో దివంగత చిట్టెం నర్సిరెడ్డి మరణానంతరం ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు మరింత పట్టుదలతో పనిచేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. జయమ్మ రిజర్వాయర్ నిర్మాణం ఆ ఆశయ సాధనలో ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు సాధనకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రజల సహకారంతోనే ప్రాజెక్టు నిర్మాణం సాధ్యం

జయమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తయి నారాయణపేట ప్రాంతం సాగునీటితో కళకళలాడాలని కుంభం శివకుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన రైతులు, పేరపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

జయమ్మ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే వ్యవసాయానికి భరోసా లభించడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని, రైతుల జీవితాల్లో స్థిరత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, రైతులకు న్యాయం చేయడం, నారాయణపేట ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం కోసం నిరంతరం కృషి చేస్తానని కుంభం శివకుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు ప్రతీక





మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సికె న్యూస్ "బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల సాధికారతకు, ప్రకృతి సమతుల్యతకు సూచిక" అని జిల్లా యంత్రాంగం పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వ సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్,డీఆర్డీఏ,జిల్లా అగ్రికల్చర్,జిల్లా హార్టికల్చర్, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. తెలంగాణ సాంప్రదాయాలు,సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ,పాటలు,నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సతీమణి రాధా,డిప్యూటీ కలెక్టర్లు మోక్షిత,బరీరా ఫరీద్,లా ఆఫీసర్ చంద్రావతి,జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖాధికారి పద్మజా, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ చంద్రకళ, ఎస్టీఓ అలివేలుమంగ ఎంతో ఉత్సాహంగా బతుకమ్మలు ఆడారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, డీఆర్డీఓ సాంబశివరావు,జిల్లా సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్,కలెక్టరేట్ మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారధులు పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## భక్తిశ్రద్ధలతో కుమారి లో బోనాల జాతర



సికె.న్యూస్. నేరడిగొండ నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బోనాల జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాల ఎత్తుకొని దుర్గాభవాని మాలాధారణ అమ్మవారి నైవేద్యం సమర్పించి. ప్రత్యేక పూజలు నిర్వహించారు

అనంతరం మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని వాడవాడలో . డిజె పాటలతో భజన వైద్యాలతో . పోతరాజు వేషధారణతో. మహిళలు ఆటపాటలతో ఊరేగింపు చేశారు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో గ్రామాల్లో సుఖ సంతోషాలతో ప్రజలంతా భక్తులు ప్రార్థించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు